క్లుప్తంగా

గిరిజన యువతకు ఉచిత కంప్యూటర్ శిక్షణ


లోతుగెడ్డ జంక్షన్‌లో శిక్షణ పొందిన విద్యార్థులు

చింతపల్లి: మండలంలోని లోతుగెడ్డ జంక్షన్‌లో నిరుద్యోగ యువతకు యువ ప్రగతి సెంటర ఆధ్వర్యంలో ఉచిత కంప్యూటర్ శిక్షణ ఇస్తున్నట్టు డైరెక్టర్ ఎం.నాగేంద్రబాబు తెలిపారు. పెదబరడ పంచాయతీ పరిధిలో గల లోతుగెడ్డ జంక్షన్‌లో నిరుద్యోగ గిరిజన యువతకు ఈ శిక్షణ ఇవ్వనున్నట్టు తెలిపారు. నెల రోజులు పాటు ఇచ్చే శిక్షణకు 18 నుంచి 26 సంవత్సరాలు మధ్య వయస్సు ఉన్నవారు అర్హులన్నారు. నెల రోజులు శిక్షణ అనంతరం సర్టిఫికెట్ మంజూరు చేస్తామన్నారు.ఈ అవకాశాన్ని గిరిజన నిరుద్యోగ యవత సద్వినియోగం చేసుకోవాలని కోరారు. మరిన్ని వివరాలకు 8332887885 నంబర్‌ను సంప్రదించాలన్నారు.

నవోదయ మోడల్ పరీక్షకు విశేష స్పందన


విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న ఉపాధ్యాయులు

పాడేరు రూరల్: మండల కేంద్రంలోని లోచలిపుట్టులోని ప్రైవేట్ పాఠశాలలో (పీఆర్‌టీ యూ) ఉపాధ్యాయుల సంఘం ఆధ్వర్యంలో ఆదివారం నవోదయ మోడల్ పరీక్ష జరిగింది. ఈ పరీక్షకు 48 మంది విద్యార్థినులు హాజరైయ్యా రు. ఉపాధ్యాయులు, ఉపాధ్యాయ సంఘం నాయకులు హేమలత, దేముళ్ళు నాయుడు, సత్యారావు, కాంతారావు, వేణుగోపాల్‌రాజు, శోభన్, హెచ్ ఎం.రాజేష్ తదితరులు పర్యవేక్షించారు.

రోడ్డు ప్రమాదంపై ముమ్మర దర్యాప్తు

గంగవరం : మండంలోని చిన్నఅడ్డపల్లి హైవేపై శనివారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన వారి వివరాలను ఎస్‌ఐ బి.వెంకటేష్ స్థానిక విలేకరులకు ఆదివారం వివరించారు. రోడ్డు ప్రమాదంల మృతి చెందిన వారు గంగవరం మండలం రాజుపేటలొద్ది గ్రామానికి చెందిన కోసు రామలింగేశ్వరరావు (29), అడ్డతీగల మండలం చినమునకనగడ్డ గ్రామానికి చెందిన కె.పెంటన్నదొర(36)గా గుర్తించినట్టు చెప్పారు. ప్రమాదస్థలిలో లభ్యమైన ఆధారాలను బట్టి గుర్తు తెలియని వాహనం వారిని బలంగా ఢీ కొట్టినట్లు తెలిసిందన్నారు. దీనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఆయన వివరించారు. అడ్డతీగల ప్రభుత్వ ఆస్పత్రిలో పోస్టుమార్టం నిర్వహించి మృతదేహాలను కుటుంబ సభ్యులకు అందించినట్లు ఎస్‌ఐ వెంకటేష్ తెలిపారు.

ట్రాఫిక్ నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు


ఆటో డ్రైవర్లకు సూచనలిస్తున్న ఎస్‌ఐ వెంకటేష్

గంగవరం: మండల కేంద్రంలో ఆటో డ్రైవర్లకు ట్రాఫిక్ నిబంధనలపై ఎస్‌ఐ వెంకటేష్ ఆదివారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆటోల్లో పరిమితికి మించి ప్రయాణికులను ఎక్కించవద్దని సూచించారు. డ్రైవర్ల వేగంగా నడపవద్దని, వాహన రికార్డులు తమ వెంట ఉంచుకోవాలన్నారు. ప్రయాణికులను సురక్షితంగా వారి గమ్యస్థానాలకు చేర్చాలన్నారు. ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నిబంధనలు పాటించాలన్నారు.

నేటితో ముగియనున్న మేలుకొలుపు

మునగపాక: మండల వ్యాప్తంగా మేలుకొలుపుల ముగింపు వేడుకలను సోమవారం ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశారు. ధనుర్మాసంలో భాగంగా ప్రారంభమైన మేలుకొలుపు కార్యక్రమాన్ని పలు గ్రామాల్లో భక్తులు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. భోగి పండగ రోజున పలు చోట్ల భారీ అన్న సమారాధనలు నిర్వహించి మేలుకొలుపును ముగించనున్నారు. మునగపాక, వాడ్రాపల్లి, తదితర గ్రామాల్లో భారీ అన్న సమారాధనలు నిర్వహించేందుకు ఏర్పాట్లు పూర్తి చేసినట్లు నిర్వాహకులు తెలిపారు.

బిక్కుబిక్కుమంటూ...

- శిథిలావస్థలో మండల పరిషత్ కార్యాలయ భవనం
- భయం భయంగా విధులు నిర్వహిస్తున్న సిబ్బంది
- వర్షం పడితే గదులన్నీ జలమయం
- పాడైపోతున్న రికార్డులు, సామగ్రి


శిథిలదశకు చేరిన మండల పరిషత్ కార్యాలయ భవనం


పెచ్చులూడిన శ్లాబ్

ముంచంగిపుట్టు: మండల కేంద్రంలో ఉన్న మండల ప్రజా పరిషత్ కార్యాలయ భవనం పూర్తిగా శిథిలావస్థకు చేరుకుంది. భవనం గోడలు బీటలు వారి తలుపులు, కిటికీలు ఊడిపోతున్నాయి. భవనం పైకప్పు రేకులు పాడయ్యాయి. శ్లాబ్ నుంచి పెచ్చులు ఊడిపడుతున్నాయి. దీంతో కార్యాలయ సిబ్బంది భయపడుతూ విధులు నిర్వహించాల్సిన పరిస్థితి నెలకొంది. కార్యాలయంలో రికార్డులు, సామగ్రి భద్రపరిచేందుకు ఇబ్బందులు పడుతున్నారు. ప్రతి రోజు సిబ్బంది ఇబ్బందులతోనే విధులు నిర్వహిస్తున్నారు.1972 సంవత్సరంలో నిర్మించిన ఈ భవనం ప్రస్తుతం 52ఏళ్లు పైడింది. భవనం ప్రస్తుత పరిస్థితి అత్యంత ఘోరంగా ఉందని స్థానికులు చెబుతున్నారు. వర్షం పడితే గదులన్నీ జలమయమవుతున్నాయంటున్నారు. భవనంలో గదుల్లో ఇదే పరిస్థితి నెలకొని ఉండడంతో ఉద్యోగులు బిక్కుబిక్కుమంటూ విధులు నిర్వహిస్తున్నారు. ఈ భవనం శిథిలదశకు చేరడంతో ఎప్పుడు కూలుతుందోనని సిబ్బంది ఆందోళన చెందుతున్నారు.

పాడైన కిటికీలు, తలుపులు

ఎంపీడీవో కార్యాలయ గదులకు ఏర్పాటు చేసిన తలుపులు, కిటికీలకు చెదలుపట్టి చాలా వరకు పాడైపోయాయి. కొన్ని కిటికీల తలుపులు వేసే పరిస్థితి లేదు. కిటికీల తలుపులు వేసేందుకు ప్రయత్నం చేస్తే ఊడిపోతున్నాయి. దీంతో అప్పుడప్పుడు విష సర్పాలు ఎంపీడీవో కార్యాలయంలోకి ప్రవేశిస్తున్నాయి. దీంతో సిబ్బంది భయపడాల్సిన పరిస్థితి నెలకొంది. కార్యాలయానికి ఒకటి, రెండు సార్లు మరమ్మతులు చేసి, రంగులు వేయించారు. అయినా సరే శిథిలావస్థకు చేరడంతో రేకుల పాడైపోవడం, శ్లాబ్ నుంచి పెచ్చులూడి పడుతున్నాయి. వర్షం పడేటప్పుడూ పలుచోట్ల నీరు కారుతుండడంతో విధులకు సైతం ఆటంకం కలుగుతుంది. ఇటీవల భారీ వృక్షం ఎంపీడీవో కార్యాలయానికి చెందిన భవనంపై పడడంతో భవనం పూర్తిగా పాడైపోయింది. ఎంపీడీవో కార్యాలయానికి సంబంధించిన అన్ని భవనాలు, ముఖ్యంగా సమావేశ మందిరం శిథిలావస్థలో ఉండడం మండల సమావేశాలు జరిగినప్పుడు అవస్థలు తప్పడం లేదని పలువురు చెబుతున్నారు. సమస్యను పలుమార్లు ఉన్నతాధికారులకు తెలియజేసినా పట్టించుకోవడం లేదని స్థానికులు చెబుతున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి ఎంపీడీవో కార్యాలయం నూతన భవనాల నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలని కోరుతున్నారు. వేగవంతంగా సమస్యను తీర్చాల్సిన అవసరం ఉందంటున్నారు.


చెట్టు కూలడంతో దెబ్బతిన్న భవనం

ప్రతిపాదనలు పంపాం



మండల పరిషత్ కార్యాలయం శిథిలావస్థలో ఉంది. కిటికీలు, తలుపులు పాడైయ్యాయి. భవనం పైకప్పు రేకులు పాడై, శ్లాబ్ నుంచి పెచ్చులూడుతున్నాయి. అప్పుడప్పుడు విష సర్పాలు గదులలోకి వస్తున్నాయి, రికార్డులు, సామగ్రి నిల్వకు ఇబ్బందిగా ఉంది. భవన పరిస్థితిని ఉన్నతాధికారులకు తెలియజేశాం. ప్రతిపాదనలు పంపాం. – ఎం.శ్రీసాయిహర్ష, ఎంపీడీవో, ముంచంగిపుట్టు

క్రీడలతో మానసిక ఉల్లాసం


వాలీబాల్ టోర్నీ ప్రారంభిస్తున్న సీఐ కన్నపరాజు

ఎటపాక: యువత చదువుతో పాటు క్రీడల్లో రాణించి గ్రామానికి మంచి పేరు తీసుకురావాలని ఎటపాక సీఐ కన్నపరాజు అన్నారు. ఎన్టీఆర్ మెమోరియల్ మండల స్థాయి వాలీబాల్ టోర్నమెంట్‌ను కృష్ణవరం గ్రామంలో ఆయన ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రీడలతో మానసిక ఉల్లాసం కలుగుతుందన్నారు. యువత చెడు వ్యసనాలకు దూరంగా ఉండి మంచి సమాజ నిర్మాణానికి కృషి చేయాలని కోరారు. వాలీబాల్ క్రీడలో రాణించే వారికి ప్రభుత్వం నుంచి ప్రోత్సాహకాలు అందేలా చూస్తామని తెలుగు యువత రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వల్లభనేని చందు అన్నారు. టోర్నీ నిర్వాహకులు చందు, పీటీ రమేష్ తదితరులున్నారు.

32 మందికి కంటి వైద్య పరీక్షలు


రోగులను పరీక్షిస్తున్న డాక్టర్


రంపచోడవరం: మండలంలోని సిరిగిందలపాడులో రామకృష్ణ మిషన్ గిరిజన సంచార వైద్యశాల (రాజమహేంద్రవరం) ఆధ్వర్యంలో ఆదివారం వైద్యశిబిరం నిర్వహించారు. శిబిరంలో సుమారు 32 మందికి కంటి వైద్య పరీక్షలు చేసినట్టు రామకృష్ణ మిషన్ కార్యదర్శి స్వామి పరిజ్ఞేనందజీ మహారాజ్ తెలిపారు. వేమగిరి పరమహంస యోగానంద నేత్రాలయం వైద్యులు కంటి పరీక్షలు చేశారన్నారు. ఇందులో భాగంగా ఎనిమిది మందికి కళ్లద్దాలు పంపిణీ చేశామన్నారు. రామకృష్ణ మిషన్ అందిస్తున్న వైద్య సేవలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. వైద్యులు దాసరి ఉమ మహేష్, సంపత్ కుమార్ వైద్య సేవలు అందించారు. శిబిరంలో క్యాంప్ కో–ఆర్డినేటర్ శ్రీనివాస్, అప్పారావు, సిబ్బంది పాల్గొన్నారు.

15న జిల్లా స్థాయి గుర్రపు పోటీలు


పోటీల పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న దృశ్యం

మునగపాక: సంక్రాంతి సంబరాల్లో భాగంగా మునగపాకలో ఈ నెల 15న జిల్లా స్థాయి గుర్రపు పందాలు పోటీలు నిర్వహించనున్నట్లు డాన్‌జిమ్ అధినేత పెంటకోట అజయ్ తెలిపారు. ఈ మేరకు ఆదివారం పోస్టర్లను ఆయన ఆవిష్కరించారు. అనంతరం మాట్లాడుతూ వాడ్రాపల్లికి వెళ్లే మార్గంలో మధ్యాహ్నం 1.30 గంటలకు పోటీలు ప్రారంభమవుతాయన్నారు. ఈ కార్యక్రమంలో ఉత్సవ కమిటీ చైర్మన్ శరగడం జగన్, దాడి అప్పలనాయుడు, వేగి రామకృష్ణ, కర్రి కోటి, తదితరులు పాల్గొన్నారు.

నేడు మల్లంపాలెంలో స్వయంభూ విఘ్నేశ్వర తీర్థం


విఘ్నేశ్వర స్వామి

కె.కోటపాడు : మల్లంపాలెం గ్రామంలో భోగి పండగ పర్వదినాన్ని పురస్కరించుకొని సోమవారం స్వయంభూ విఘ్నేశ్వర స్వామి తీర్థ మహోత్సవాన్ని నిర్వహించనున్నట్టు గ్రామ పెద్దలు తెలిపారు. ఉదయం నుంచి స్వామి వారి ఆలయంలో ప్రత్యేక పూజా కార్యక్రమాలతో పాటు మధ్యాహ్నం ఆలయ ప్రాంగణంలో అన్న సమారాధన నిర్వహిస్తున్నట్టు తెలిపారు. తీర్థం పురస్కరించుకుని మహిళలకు ముగ్గుల పోటీలు, కోలాట ప్రదర్శనలు జరపనున్నట్టు తీర్థ నిర్వాహక కమిటీ సభ్యులు తెలిపారు.

వివేకానందునికి ఘన నివాళి


చింతూరులో వివేకానందుని చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న అధ్యాపకులు, విద్యార్థులు


అడ్డతీగలలో స్వామి వివేకానంద విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న స్థానికులు

చింతూరు: స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఎస్‌విస్‌ఎస్ ఆధ్వర్యంలో స్వామి వివేకానంద జయంతి సందర్భంగా యువజన దినోత్సవాన్ని ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ రత్నమాణిక్యం మాట్లాడుతూ భారతదేశ ఔన్నత్యాన్ని విదేశాలకు చాటిచెప్పిన స్వామి వివేకానందను యువత ఆదర్శంగా తీసుకోవాలని సూచించారు. ఆయన విలక్షణమైన జీవనశైలి, సేవలు అందరికీ మార్గదర్శకంగా నిలుస్తాయని తెలిపారు. అధ్యాపకులు పద్మ, శకుంతల, హారతి, శైలజ, అప్పనమ్మ, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

అడ్డతీగల: అడ్డతీగలలోని వివేకానంద విద్యానికేతన్‌లో ఆదివారం స్వామి వివేకానంద జయంతి మహోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు విశ్వహిందూ పరిషత్ ప్రతినిధులు ఎస్. బావున్నారాయన, పి.కుమార్ రావు ఆధ్వర్యంలో వివేకానందుని విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. వివేకానంద ఆలోచనల స్ఫూర్తితో విద్యార్థులు ముందుకు వెళ్లాలని విశ్వహిందూ పరిషత్ ప్రతినిధి భావనారాయణ అన్నారు. ఆర్‌ఎస్‌ఎస్ వనవాసీ కళ్యాణ్ ఆశ్రమం ప్రతినిధులు పాల్గొన్నారు.

కోడిపందాలు ఆడితే కఠిన చర్యలు


ప్రచారం చేస్తున్న పోలీసులు సిబ్బంది

గంగవరం: సంక్రాంతి సందర్భంగా గ్రామాల్లో కోడి పందాలు, జూదాట ఆడితే కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్‌ఐ వెంకటేష్ హెచ్చరించారు. గంగవరం పోలీసు స్టేషన్ పరిధిలో గిరిజన గ్రామాల్లో గంగవరం ఎస్‌ఐ వెంకటేష్ ఆధ్వర్యంలో పోలీసులు ఆటో ద్వారా విస్తృత ప్రచారం నిర్వహించారు. సంక్రాంతి పండగను కుటుంబ సభ్యులు కలసిమెలసి ఆనందంగా జరుపుకోవాలని గ్రామాల్లో ఏ విధమైన జూదాట తదితర క్రీడలు జోలికి పోవద్దని హెచ్చరించారు. గంగవరం, నెల్లిపూడి, మొల్లేరు, జడేరు, మోహనాపురం, జగ్గంపాలెం తదితర గ్రామాల్లో పోలీసు సిబ్బంది ఆటోల్లో పర్యటించి విస్తృత ప్రచారం నిర్వహించారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం


సత్కరించిన ఉపాధ్యాయులతో పూర్వ విద్యార్థులు

రోలుగుంట : స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాలలో 2000–2001, అలాగే 2001–2002 విద్యాసంవత్సరాల పదో తరగతి పూర్వ విద్యార్థులు ఆదివారం స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాల అవరణలో విడివిడిగా ఆత్మీయ సమ్మేళన కార్యక్రమాలను ఉత్సాహంగా నిర్వహించుకున్నారు. ఆదివారం ఉదయం వారంతా పాఠశాలకు వచ్చి ఆత్మీయ సమావేశమయ్యారు. విద్యాభ్యాసం నాటి మధురస్మృతులు నెమరు వేసుకున్నారు. పాఠశాల అవరణలో కలియ తిరిగారు. ఒకరికొకరు యోగక్షేమాలు తెలుసుకున్నారు. వారి ఆహ్వానం మేరకు వచ్చిన ప్రస్తుత ఎంఈవో–2 జగ్గారావు, అప్పటి సోషల్ టీచర్ సోములు, అప్పలస్వామి, ఏకా నర్సింహమూర్తి, వెదురుపర్తి నాగభూషణంను శాలువా కప్పి పుష్ప గుచ్ఛం అందజేసి సత్కరించారు. పూర్వపు విద్యార్థులు వారి గురువుల వద్ద దీవెనలు తీసుకున్నారు.

మాకవరపాలెం : పూర్వ విద్యార్థుల అపూర్వ కలయిక ఎంతో ఉత్సాహంగా సాగింది. మాకవరపాలెం ఉన్నత పాఠశాలలో 2007–08 ఏడాదిలో 10 వ తరగతి చదివిన పూర్వ విద్యార్థులు ఆదివారం రాచపల్లి జంక్షన్ సమీపంలో ఉన్న కామేశ్వరమ్మ ఆలయం వద్ద సమ్మేళనం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా 17 ఏళ్ల క్రితం నాటి జ్ఞాపకాలను నెమరు వేసుకుని ఉదయం నుంచి సాయంత్రం వరకు ఆనందంగా గడిపారు. తమకు విద్యాబుద్ధులు నేర్పిన ఉపాధ్యాయులను గుర్తు చేసుకున్నారు. ఒకరికి ఒకరు యోగక్షేమాలతోపాటు ప్రస్తుతం ఏఏ రంగాల్లో స్థిరపడ్డారో తెలుసుకున్నారు. ఈ సమ్మేళనంలో సుమారు 100 మందికి పైగా పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.

ఇసుక రీచ్‌ల పరిశీలన

కోటవురట్ల: గొట్టివాడ, పందూరు ఇసుక రీచ్‌లను అధికారుల బృందం ఆదివారం పరిశీలించింది. ఇసుక తవ్వకాలు, ఇసుక లభ్యతపై తహసీల్దారు తిరుమలబాబు ఆధ్వర్యంలో ఆర్‌డబ్ల్యూఎస్, ఇరిగేషన్ శాఖాధికారులు పరిశీలన చేశారు. తహసీల్దారు మాట్లాడుతూ ఆర్‌డబ్ల్యూఎస్, ఇరిగేషన్ శాఖాధికారుల నివేదికను అనుసరించి నదిలో ఇసుక లభ్యత ప్రకారం చర్యలు తీసుకుంటామన్నారు. ప్రభుత్వ భవనాలు, సీసీ రోడ్ల నిర్మాణాల కోసం నివేదిక వచ్చాక ఇసుక సరఫరా కోసం నిర్ణయం తీసుకుంటామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎస్‌ఐ రమేష్, తదితరులు పాల్గొన్నారు.

కల్కి అవతారంలో ధ్యాన వేంకటేశ్వరస్వామి


ప్రత్యేకాలంకరణలో వేంకటేశ్వరస్వామి

కశింకోట: స్థానిక ధ్యాన వేంకటేశ్వరస్వామి ఆలయంలో స్వామివారు కల్కి అవతారంలో ఆదివారం భక్తులకు దర్శనమిచ్చి కనువిందు చేశారు. ధనుర్మాసోత్సవాలలో భాగంగా విష్ణుమూర్తి దశావతారాల్లో చివరి అవతారంగా కల్కిగా అలంకరించి విష్ణు సహస్ర నామార్చన చేశారు. ప్రత్యేక అభిషేకాలు నిర్వహించారు. భక్తులు ఎక్కువగా దర్శించారు. సోమవారం ఉదయం 10 గంటలకు గోదాదేవి కల్యాణోత్సవాన్ని నిర్వహించనున్నట్లు అర్చకుడు రేజేటి రామచరణాచార్యులు తెలిపారు.

పల్లెల్లో హరిదాసుల సందడి


రాజవొమ్మంగిలో హరిదాసుకు కానుకలు సమర్పిస్తున్న గృహిణి


ఉర్లాకులపాడులో గంగిరెడ్ల వారు ఊరేగింపు


హరిదాసు వేషాల్లో చిన్నారులు

రాజవొమ్మంగి: పల్లెల్లో హరిదాసులు, బుడగజంగాలు, పగటి వేషధారులతో వీధి వీధిలో రోజుకో తీరున సందడి మొదలైంది. హరిలో రంగ హరి.. అంటూ హరిదాసులు వేకువజామునే ఇంటి ముంగిటకు వచ్చి అక్షయపాత్ర చేతపట్టి దర్శనం ఇస్తున్నారు. ఇక పగటి వేషధారులు రోజుకో వేషం కృష్ణునిగా, జాంబవంతునిగా, శ్రీరాముడు, ఆంజనేయస్వామి తదితర రూపాలులో అందరిని ఆకర్షిస్తున్నారు. ఏడాదికి ఒక సారి వస్తాము అమ్మా...అంటూ బుడగజంగాలు, గంగిరెద్దులను ఆడించే వారు ఇంటింటికి వచ్చి పాటలు పాడుతు అందరిని అలరిస్తు, ఆకర్షిస్తున్నారు. వీరందిరిని చూడగానే పిల్లలు పెద్దలు అమ్మో సంక్రాంతి పండుగ దగ్గరకు వచ్చేసిందంటూ హడావుడిగా పండుగ పనులకు శ్రీకారం చుడుతున్నారు. ఇంటిల్లి పాది పండుగ ఘనంగా జరుపుకునేందుకు సన్నద్ధమయ్యారు. ప్రతి రోజు ఇంటి ముంగిట రంగవల్లులు అద్దుతూ ఆనంద పడుతున్నారు. ఇక ఖరీఫ్ వరి సీజన్ ముగిసి పంట ఇంటికి చేరడంతో రైతన్నల కళ్లల్లో ఆనందానికి అంతులేకుండా పోయింది. తిండి గింజలకు అవసరమైన ధినుసులు ఉంచుకొని మిగతా వాటిని అమ్ముకోగా వచ్చి సొమ్ముతో ఏడాది పొడవునా కుటుంబపోషణకు ప్రణాళికలు వేస్తున్నారు. ఇప్పటికే ఇళ్లన్నీ కొత్త రంగులతో గుమ్మాలకు తోరణాలతో, ముంగిట అందమైన ముగ్గులతో దర్శనమిస్తున్నాయి. పండగ ప్రత్యేక వంటకాలతో ఇళ్లన్నీ ఘుమఘుమలాడుతున్నాయి. కొత్త అల్లుళ్లు, బంధు, మిత్రుల రాకతో ప్రతి ఇంటా పండగ ఆనందం సంతరించుకుంది.

ఆకట్టుకున్న చిన్నారుల వేషధారణ

సంక్రాంతికి వచ్చే గంగిరెద్దులు, హరిదాసులు, బుడబుక్కలు, పగటి వేషధారులు రాను రాను కనుమరుగవుతున్నారు. ఈ నేపథ్యంలో పలు కుటుంబాలు తమ చిన్నారులను హరిదాసులు వేషధారణలో అలంకరిస్తున్నారు. మండల కేంద్రంలో ఓ ఇంట తమ చిన్నారుల హరిదాసు వేషధారణ ఆకట్టుకుంది. ఇదిలా ఉండగా పెద్ద పండగ నేపథ్యంలో సోమవారం జరుపుకోనున్న భోగి పండగకు పెద్దలు, చిన్నారులు అవసరమైన ఏర్పాట్లు చేస్తు సందడి చేశారు. సంక్రాంతి పండగ నేపథ్యంలో పలుచోట్ల ఆటల పోటీలు నిర్వహించారు. విజేతలకు బహుమతులు అందజేశారు.

గోదాదేవి కల్యాణోత్సవానికి ఏర్పాట్లు


కశింకోటలో వేణుగోపాలస్వామి ఆలయం

కశింకోట: స్థానిక దేవాదాయ శాఖకు చెందిన రుక్మిణి, సత్యభామ సమేత వేణుగోపాలస్వామి ఆలయంలో సోమవారం సాయంత్రం 6 గంటలకు గోదాదేవి కల్యాణోత్సవాన్ని నిర్వహించడానికి ఏర్పాట్లు చేశారు. ధనుర్మాసోత్సవాల్లో భాగంగా భోగి రోజు వేణు గోపాలస్వామి, గోదాదేవిల ఉత్సవ విగ్రహాలకు కల్యాణాన్ని వేద మంత్రాల నడుమ సంప్రదాయంగా నిర్వహిస్తారు. ఇందుకు సన్నాహాలు చేశామని ఆలయ వ్యవస్థాపక ధర్మకర్త రేజేటి శ్రీరామాచార్యులు, అర్చకులు సీతారామాచార్యులు, మారుతి తెలిపారు. సంక్రాంతి రోజు ఆలయం వద్ద తీర్థ మహోత్సవం జరగనుందన్నారు. తోడపెద్దు సేవ, సాంస్కృతిక కార్యక్రమాల ప్రదర్శన ఏర్పాటు చేశామన్నారు. గవరపేటలో వెలసిన శ్రీదేవి, భూదేవి సమేత వేంకటేశ్వరస్వామి ఆలయంలోనూ ధనుర్మాసోత్సవాల ముగింపులో భాగంగా గోదాదేవి కల్యాణోత్సవాన్ని సాయంత్రం నిర్వహించనున్నట్లు ఆలయ వ్యవస్థాపక ధర్మకర్త భీశెట్టి దుర్గా నాగేశ్వరరావు తెలిపారు.

మాడుగుల : స్థానిక అతిపురాతన పార్థసారథి స్వామి ఆలయం వద్ద సోమవారం ఉదయం అత్యంత వైభవంగ గోదాదేవి కల్యాణం జరగనుందని, ఆలయ ప్రధాన అర్చకుడు పార్థసారదాచార్యులు తెలిపారు. ఇప్పటికే స్వామివారిని గోదాదేవిని పుష్పాలు నగలతో ప్రత్యేకంగా అలంకరించామన్నారు. ధనుర్మాసం ప్రారంభం నుంచి కొనసాగుతున్న తిరువీధి ఉత్సవాలు కనుమ పండుగ రోజుతో ముగుస్తాయన్నారు.

రోలుగుంట : మండలం కేంద్రంలో గల సిద్ధి వినాయక, జీవకారుణ్య సంఘాల సభ్యులు సంయుక్తంగా ధనుర్మాసోత్సవాలను ఘనంగా నిర్వహిస్తున్నారు. గత నెలలో ప్రారంభమైన ఈ ఉత్సవాలు ఆదివారం కూడా కొనసాగాయి. దీనిలో భాగంగా గోదాదేవిని మండలంలో గల గ్రామాల్లో రోజుకో గ్రామం వెళ్లి ఆ వీధిలో తిరుగుతూ వేకువజామునే విష్ణుమూర్తికి మేలుకొలుపు భక్తిగీతాలు ఆలపిస్తున్నారు. ఉత్సవమూర్తులను దర్శించుకొని భక్తుల ఇస్తున్న కానుకలు స్వీకరిస్తున్నారు. మేలుకొలుపుల కార్యక్రమం భోగి రోజుతో ఉత్సవాలు ముగుస్తాయన్నారు. భక్తుల నుంచి సేకరించిన ధన, ధాన్యం సేకరణ మొత్తంతో గోదాదేవి కళ్యాణ అనంతరం భారీ అన్నసమారాధన కార్యక్రమం నిర్వహిస్తామని, ఈ కార్యక్రమం విజయవంతానికి భక్తులందరూ సహకరించాలని విజ్ఞప్తి చేశారు.